తెలంగాణ
# ప్రజావారధి
ప్రతి అడుగు నిజం వైపు
www.telanganaprajavaradhi.com
తెలుగు దినపత్రిక



హైదరాబాద్ సంపుటి : 01 సంచిక : 01 సోమవారం 31 - 08 - 2026 ఎడిటర్ : యాదగిరి అవిశెట్టి పేజిలు : 1

## సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి

# రియల్ ఎస్టేట్ బ్రోకర్లు

## తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్

## కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంపై వారం రోజుల పాటు నిరసనలు

- ఫ్యూచర్ సిటీ, 22ఏతో రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నరు
- ఫ్యూచర్ సిటీలో రేవంత్ రెడ్డి అన్నదమ్ములు 3 వేల ఎకరాలు వెనకేశారు
- సూర్యాపేట మీదుగా వెళ్లాల్సిన బుల్లెట్ ట్రైన్‌ను రేవంత్ రెడ్డి స్వలాభం కోసం రూట్ మార్చాడు
- చంద్రబాబు దొంగతనంగా నీళ్లు ఎత్తుకపోతున్నా రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదు
- పంటలు కొనాల్సి వస్తుందనే నీళ్లు ఇవ్వడం లేదు

ప్రజావారధి/మోత్కూరు

సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రియల్ ఎస్టేట్ బ్రోకర్లుగా మారి రాష్ట్రాన్ని దోపిడీ చేస్తున్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా, హిల్ట్ పాలసీతో దోచుకున్నది చాలక ఇప్పుడు 22ఏతో ప్రజల ఆస్తులపై పడ్డారు. ప్రజల ఆస్తులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి డబ్బులు వసూలు చేయడం కోసమే రాష్ట్రంలో కోటి 16 లక్షల ఎకరాలను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి 22ఏలో చేర్చారని తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ ఆరోపించారు. మోత్కూరు మండలం దాచారం గ్రామంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఒక్క మంచి పని చేయకపోగా అన్నీ పిచ్చి పనులే చేస్తున్నాడని, రాహుల్ గాంధీ, పీసీసీ చీఫ్ ఎవరు చేర్పిస్తారో గానీ రేవంత్ రెడ్డిని ఎర్రగడ్డ పిచ్చాసుపత్రిలో చేర్పించాలన్నారు. మూసీ ప్రక్షాళన, హైడ్రా పేరుతో పేదల ఇండ్లను కూల్చేసి ఆస్తులను లాక్కుంటున్న ప్రభుత్వం ఇప్పుడు 22ఏను తెచ్చి 30, 40 ఏళ్ల క్రితం కొనుక్కున్న ఇళ్లను, ప్లాట్లను, భూములన్నింటినీ బ్లాక్ లిస్టులో చేర్చిందన్నారు. 1954 నుంచి ఉన్న భూములను కూడా బ్లాక్ లిస్టులో ఎలా చేర్చుతారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో 22ఏలో ఉన్న చాలా భూముల సమస్యలను పరిష్కరించామని, ఇప్పటికే ప్రజలు, రైతులు దుమ్మెత్తి పోస్తుండటంతో మళ్లీ ఏం చేసినా అధికారంలో వచ్చే పరిస్థితి లేకపోవడంతో 22ఏతో దోపిడీకి తెరలేపారన్నారు. రేవంత్‌రెడ్డి వచ్చాక ఏ రంగం బాగుపడింది లేదని, రియల్ ఎస్టేట్ పూర్తిగా దెబ్బతిందన్నారు. రేవంత్‌రెడ్డి స్వలాభం కోసమే ఫ్యూచర్ సిటీ నిర్మిస్తానంటున్నాడని, ఫ్యూచర్ సిటీ పేరుతో రేవంత్‌రెడ్డి అన్నదమ్ములు 3 వేల ఎకరాలు వెనకేసున్నారని ఆరోపించారు.



ఢిల్లీకి మూటలు పంపి కుర్చీని కాపాడుకోవడం కోసమే ఫ్యూచర్ సిటీపై పడ్డారని, హైదరాబాద్ నుంచి సూర్యాపేట మీదుగా విజయవాడ వెళ్లాల్సిన బుల్లెట్ ట్రైన్ ను కూడా రేవంత్ రెడ్డి స్వలాభం కోసమే రూట్ మార్చి ఫ్యూచర్ సీటి మీదుగా గుంటూరుకు మల్లించారని తెలిపారు. రేవంత్‌రెడ్డి స్వలాభం కోసం తప్పితే రాష్ట్రం కోసం, ప్రజల కోసం చేసింది ఒక్క పని కూడా లేదని, రాష్ట్రాన్ని పూర్తిగా భ్రష్టు పట్టిస్తున్నారన్నారు. 400 ఏళ్ల చరిత్ర ఉన్న హైదరాబాద్ ను తానే నిర్మించానని గొప్పలు చెప్పుకున్న చంద్రబాబుకు అమరావతిని నిర్మించడం ఎందుకు చేతకావడం లేదని, ఇప్పుడు రేవంత్‌రెడ్డి మాటలు కూడా అలానే ఉన్నాయని విమర్శించారు. శ్రీశైలం నిండకముందే తెలుగుగంగ, పోతిరెడ్డిపాడుతో కృష్ణా జలాలు దొంగతనంగా ఎత్తుకపోతున్నా సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని, తెలంగాణ రైతాంగ ప్రయోజనాలు పట్టవా అని ప్రశ్నించారు. కాళేశ్వరాన్ని, జూరాలను గాలికొదిలేశారన్నారు. నాగార్జునసాగర్ నిండినా ఇళ్లు ఇచ్చేది లేదని మంత్రి వెంకట్‌రెడ్డి మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులకు నీళ్లు ఇచ్చే ఉద్దేశం లేదని, నీళ్లు ఇస్తే పంటలు కొనాల్సి వస్తుందని, బోనస్ ఇవ్వాల్సి వస్తుందని, ఇప్పటికే యూరియా ఇవ్వకుండా రైతులను ముప్పుతిప్పలు పెడుతున్న ప్రభుత్వం ఇప్పుడు నీళ్లు కూడా ఇవ్వడం లేదన్నారు. రాజగోపాల్ రెడ్డి, మంత్రి సురేఖ మాటలతో కుర్చీకే ఎసరొస్తుందని అమెరికా వెళ్లి రాహుల్ గాంధీ సలహాదారుడు శ్యాంప్రిటోడాను కలిసేందుకు ప్రయత్నించగా ఆయన అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతోనే కేంద్ర ప్రభుత్వం తన పర్యటనను అడ్డుకుందని చెప్తున్నాడన్నారు. సురేఖ రాఖీ కట్టడంతో రేవంత్‌రెడ్డితో పంచాది ముగిసిందని, రేవంత్‌కు మద్దతుగా ప్రెస్‌మీట్లు ఎమ్మెల్యేలంతా పిచ్చోళ్లయ్యారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన తప్పులకు రైస్‌మిల్లర్లు ఇబ్బందులు పడుతున్నారని, మిల్లర్ల నుంచి డబ్బులు వసూలు చేయడానికే రైస్‌మిల్లులపై దాడులు చేస్తున్నారని తెలిపారు. సీఎంకే చదువు సక్కగా రాదని, స్కిల్ యూనివర్సిటీలో ఎవరు చేరకపోవడంతో 97 జీవో తెచ్చి పాలిటెక్నిక్ విద్యార్థులను దాంట్లో కలుపుతామనడం అన్యాయమని, దీంతో పాలిటెక్నిక్ విద్యార్థులకు బీటెక్ సెకండియర్‌కు వెళ్లే అవకాశం లేకుండా పోతుందని, స్కిల్ యూనివర్సిటీతో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పుకోవడానికి సీఎంకు సిగ్గుండాలన్నారు. రైతుబంధు, రైతు బీమా, కల్యాణలక్ష్మి లాంటి పథకాలను నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు. మోత్కూరు మున్సిపాలిటీకి రూ.30 కోట్లు, తిరుమలగిరి మున్సిపాలిటీకి రూ.50 కోట్లు తన హయాంలో మంజూరు చేయించానని, మున్సిపాలిటీల్లో ప్రభుత్వ చేతగానితనంతో అంతా గందరగోళం నెలకొందన్నారు. డిసెంబర్‌లో రేవంత్‌రెడ్డిని తీసేసి ఉత్తమ్‌కుమార్‌రెడ్డో మరోవరో సీఎం అవుతారని జోరుగా ప్రచారం నడుస్తుందని, మీ పదవుల పంచాదిని తెలంగాణ ప్రజలపై రుద్ది ఇబ్బందులు పెట్టవద్దన్నారు.

## వచ్చే నెల 2 నుంచి వారం రోజులు నిరసనలు

అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారెంటీలు, 420 హామీలు అమలు చేస్తామని వెయ్యి రోజులైనా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో వచ్చే నెల 2 నుంచి వారం రోజుల పాటు తుంగతుర్తి నియోజకవర్గంలో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సెప్టెంబర్ 2న తుంగతుర్తిలో భారీ నిరసన ర్యాలీ, 3న మిర్యాలగూడలో సాగునీటిపై కేటీఆర్ నిర్వహించే నిరసనలో పాల్గొనాలని, 4న వికలాంగులు, వృద్ధులకు ఇచ్చిన హామీలపై తిరుమలగిరిలో, నిధులు ఇవ్వకుండా గ్రామపంచాయతీల పాలనను నిర్లక్ష్యం చేయడంపై 5, 6న గ్రామాల్లో నిరసనలు, 7న మండల కేంద్రాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించి ప్రజావాణిలో వినతిపత్రాలు ఇవ్వాలన్నారు. తుంగతుర్తి, తిరుమలగిరి, మోత్కూరులో జరిగే కార్యక్రమాల్లో తాను పాల్గొంటానని చెప్పారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నేవూరి ధర్మేందర్ రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ రచ్చ లక్ష్మీ నర్సింహారెడ్డి, మార్కెట్ మాజీ చైర్మన్లు తీపిరెడ్డి మేఘారెడ్డి, కొణతం యాకూబ్‌రెడ్డి, చిప్పలపల్లి మహేంద్రనాథ్, బీఆర్ఎస్ మోత్కూరు మున్సిపాలిటీ అధ్యక్షుడు జంగ శ్రీను, ప్రధానకార్యదర్శి గజ్జి మల్లేష్, మున్సిపల్ కౌన్సిలర్లు కొండా శోభ, నల్ల మధు, నాయకులు కొండా సోంమల్లు, పానుగుల విష్ణు, దాసరి తిరుమలేష్, తిరుమలగిరి మున్సిపల్ చైర్మన్ సంకేపల్లి రఘునందన్ రెడ్డి, బీఆర్ఎస్ మండలాల అధ్యక్షులు కొమ్మిడి ప్రభాకర్ రెడ్డి, ఉప్పలయ్య, సోమేశ్ గౌడ్, సీతయ్య, మల్లయ్య, రజాక్ తదితరులు పాల్గొన్నారు.

